క్లుప్తంగా

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్, కార్పొరేట్ ట్రైనర్ బి.కె.వసంత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్: 040 2300 1234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల కాసా రోగ్ అపార్ట్‌మెంట్, అపర్ణ అపార్ట్‌మెంట్, హనుమాన్‌నగర్, భిక్షపతినగర్, ఆర్‌టీఏ ఆఫీస్ పరిసరాలలో ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కల్యాణి గార్డెన్ ఫీడర్ పరిధిలో హైదర్‌నగర్ పెట్రోల్ పంపు, మెట్రో రైల్వే స్టేషన్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో ఆల్విన్ క్రాస్ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ ఇజ్జత్‌నగర్‌లో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... పలు కాలనీలలో ప్రజల నుంచి వినతుల మేరకు డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌కి కిలో మీటరు చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు మంజూరు అయ్యాయన్నారు. జలమండలి డీజీఎం శరత్ రెడ్డి, మేనేజర్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయాలి



సత్యంరావు

హఫీజ్‌పేట్: తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో ఈ నెల 17న జరగబోయే కాంగ్రెస్ విజయభేరి సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు పిలుపునిచ్చారు. దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి, భారత్ జోడో యాత్రతో దేశాన్ని ఏకం చేసిన రాహుల్ గాంధీలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి ప్రజలు విజయభేరి సభకు తరలివచ్చి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలన్నారు. నియోజవకర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు.

పుస్తకాలతో ప్రేరణ

రాయదుర్గం: పుస్తకాలు ప్రేరణకు మూలాలు, నెట్ వర్కింగ్‌కు చిహ్నాలు అని వైశ్య బిజినెస్ నెట్ వర్క్ వ్యవస్థాపకులు శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీ కోహినూర్ లో 'ఎందరో మహానుభావులు–కొందరి పరిచయాలు' పేరిట ప్రత్యేకంగా రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఎందరో మహానుభావులు–కొందరి పరిచయం' పేరుతో రూపొందించిన పుస్తకంలో 51 వ్యాపార కుటుంబాలు సాధించిన విజయాలు, ఇతర వారికి సంబంధించిన అంశాలలను పొందపర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైశ్యనెట్ వర్క్ ప్రతినిదులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి ఓటర్లు... 6,74,232

- తెలంగాణలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గం 'శేరిలింగంపల్లి'
- ఓటరు నమోదుకు ఈ నెల 19 వరకు అవకాశం
- తుది జాబితా విడుదల అక్టోబర్ 4



సాఫ్ట్‌వేర్ ఆఫీస్‌లలో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న శేరిలింగంపల్లి ఈఆర్ఓ రజనీకాంత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ స్టాఫ్ (ఫైల్)



కాలనీల్లో పోలింగ్ బూత్ స్థాయిలో ప్రచారం చేస్తున్న బీఎల్ఓలు (ఫైల్)

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి గుర్తింపును కొన్నేళ్లుగా సాధిస్తూనే ఉంది. అందులో భాగంగా ఈ సారి ఏకంగా మొత్తం ఓటర్ల సంఖ్య 6,74,232 మందికి చేరింది. ఈ సంఖ్య 7 లక్షల వరకు పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. ఇది నగరంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్ల సంఖ్య కలిగిన నియోజకవర్గంగా మారడం విశేషం. అంతేకాకుండా అధికార యంత్రాంగం కృషి కూడా ఈ సంఖ్య పెరగడంలో విశేష పాత్ర పోషించింది. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, ఐటీ సంస్థలలో జీహెచ్ఎంసీ అధికారులు పర్యటిస్తూ అవగాహన కల్పిస్తూ ఓటర్ల సంఖ్య పెరగడానికి అవకాశం కలిగింది. తుది జాబితా అక్టోబర్ 4వ తేదీన విడుదలు చేయనున్నారు.

ఆగస్టు 21న విడుదల చేసిన డ్రాఫ్ట్ రోల్ ప్రకారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- శేరిలింగంపల్లి నియోజకవర్గ మొత్తం ఓటర్లు: 6,74,232
- పురుషులు: 3,58,122
- మహిళలు: 3,15,971
- ఇతరులు: 139
- మొత్తం పోలింగ్ స్టేషన్లు: 622

కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు మరింత అవకాశం

- కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి, మార్పులు, చేర్పులకు మరింత అవకాశాన్ని ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.
- ఈ నెల 19వ తేదీ వరకు కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు.
- దీంతో గణనీయంగా పెరిగే అవకాశం కూడా ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

విస్రతంగా ప్రచారం.

- జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేశారు.
- ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో వీకెండ్స్‌లలో పర్యటించి అక్కడి వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశమై ఈ అవకాశం కల్పించారు.
- ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలలోని ఐటీ సంస్థలలో కూడా అధికారులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సమావేశమై అవగాహన కల్పించారు.
- ఇందులో భాగంగా కొత్తగా ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పులపై కూడా అవగాహన కల్పించడంతోపాటు ఓటుహక్కును విధిగా వినియోగించడంపై కూడా వారికి అవగాహన కల్పించడం మరో విశేషం.
- ఈ నేపథ్యంలోనే ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం లేకపోలేదని అధికారులు భావిస్తున్నారు.
- కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అడ్రస్ మార్పులకు వేల సంఖ్యలోనే దరఖాస్తులు రావడం విశేషం. మరింతగా అవకాశం కూడా ఉండడంతో మరింత మంది ఓటర్లు పెరిగే అవకాశం లేకపోలేదు.
- 31,000 దరఖాస్తులు కొత్తగా ఓటరు నమోదు కోసం సెప్టెంబర్ 13వ తేదీ వరకు వచ్చాయి.
- వాటిలో 12,805 దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తి కాగా ఇంకా 17,000 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది.
- 12,400 తప్పుల సవరణలు, అడ్రస్ మార్పు కోసంచ్చిన దరఖాస్తులు.

నేటి నుంచి బీహార్ హస్తకళా ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నుంచి ఉపేంద్ర మహారథి శిల్ప అనుసంధాన్ సంస్థాన్, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పది రోజుల పాటు బీహార్ చేనేత హస్తకళ ఉత్పత్తుల మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేళా 16 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి రోజు సాయంత్రం ఆంపి థియేటర్‌లో 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. బీహార్ రాష్ట్రం నుంచి 110 మంది చేనేత హస్తకళాకారులతో పాటు మధుబని పేయింటింగ్ చీరలు, ఖాదీ షర్టులు, జూట్ ఉత్పత్తులు, స్టోన్ కార్వింగ్, హ్యాండ్‌లూమ్ చీరలు, పెయింటింగ్ చీరలు ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ర్యాలీ

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ సీనియర్ నేత నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతూ చిట్కుల్ ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం చిట్కుల్ నుంచి రుద్రారం గణేష్‌గడ్డ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ శ్రీను, నాయకులు సింహాద్రి, నర్సింహులు, వెంకటేశ్, సంజీవ్, శ్రీను, స్వామి, శ్రీను, జంగయ్య, నరేష్, రాము, రాజు, విష్ణు, ప్రశాంత్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెండు విడతల్లో వెయ్యి మందికి 'డబుల్' ఇళ్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు హాజరైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు రెండు విడతల్లో 1000 మందిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారని ఆయన తెలిపారు. మొదటి విడతలో 500 మందిని ఎంపిక చేసి ఫ్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. వికలాంగులకు 24, ఎస్సీలకు 83, ఎస్టీలకు 29, ఇతరులకు 364 కేటాయించారన్నారు. రెండో విడత లబ్ధిదారులకు ఈ నెల 21న ఇళ్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



శేరిలింగంపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు మూడవ రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కాకపోవడంతో ఉప కులాలకు రిజర్వేషన్‌లలో దక్కాల్సిన న్యాయమైన వాటా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్లు అవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. శేరిలింగంపల్లి మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ కోడిచర్ల ప్రేమ్‌కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు సింగదాసరి నరేష్ మాదిగ, సింగదాసరి రాజు మాదిగ, ములకలపల్లి సాయిలు మాదిగ, వినోద్ మాదిగ, సోను మదిగ, ఎర్రోళ్ల రాజు, మానయ్య మాదిగ, చెరుకుపల్లి కనకమ్మ మాదిగ, గజ్జి జానకమ్మ మాదిగ, పద్మ, సరోజ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమూరి తుకారాం మృతి

- పలువురు ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న డాక్టర్ కె.నారాయణ తదితరులు

హఫీజ్‌పేట్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ హోమ్ ఫర్ ఏజ్డ్ సలహా కమిటీ సభ్యుడు, బ్రహ్మయ్య అండ్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ వ్యవస్థాపకుడు సోమూరి తుకారాం(92) శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయానికి సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోమూరి తుకారాం గత 18 సంవత్సరాలుగా సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న హోం ఫర్ ఏజ్డ్‌లో నివసిస్తున్నారని అన్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారన్నారు. వృద్ధాశ్రమంలో నివసిస్తూ సీఆర్ ఫౌండేషన్ కార్యకలాపాలకు సహాయపడుతూ పలువురిని ప్రొత్సహించేవారన్నారు. ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణకుమారి, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ సరస్వతి, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధులు సోమూరి తుకారాం భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి.

డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యం



కొండాపూర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్

- దశలవారీగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు
- ప్రతి డివిజన్‌కు ఒక కిలోమీటరు భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ, గుల్షన్‌నగర్, గోపాల్‌రెడ్డినగర్‌లలో రూ. 80 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... దశలవారీగా శేరిలింగంపల్లిలోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి ఈ సమస్య తీసుకరాగా వారి ప్రత్యేక చొరవతో అదనంగా నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అదనంగా ఒక కిలోమీటరు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనులు మంజూరు చేశామన్నారు. శేరిలింగంపల్లిలో అత్యవసరమున్న చోట నిత్యం పొంగుతున్న ప్రాంతంలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శేరిలింగంపల్లిలో చేపట్టే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనుల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనుల తోపాటు నాలాల విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణ పనులను చేపట్టామని, వాటన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్లు యాదయ్య, సందీప్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, నాయకులు, వార్డు, ఏరియా మాజీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో సఫాయి మిత్ర–సురక్ష శివర్ అంశంపై శుక్రవారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ 15రోజుల పాటు మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రశాంతమైన వాతావరణంలో పండగలను జరుపుకోవాలని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పకుండా అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో కార్పొరేటర్ పుష్పనాగేష్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నారాయణ, అప్పల భాస్కర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

ముగ్గురికి జైలుశిక్ష

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఏడుగురికి జరిమానా, ముగ్గురికి జైల్‌శిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురు వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా, మరో ముగ్గురికి రెండు రోజుల పాటు జైల్‌శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

శాంపిల్స్ కలెక్షన్‌కు వచ్చి..

మంటలు అంటుకొని

ల్యాబ్‌టెక్నీషియన్ మృతి

పటాన్‌చెరు టౌన్: శాంపిల్స్ కలెక్షన్ల కోసం వచ్చిన ల్యాబ్‌టెక్నీషియన్ మంటలు అంటుకొని మృతిచెందింది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం... లింగమయ్య కాలనీకి చెందిన ఫాతిమా(28) చందానగర్ టెస్లా ల్యాబ్‌లో పనిచేస్తున్నది. ఈనెల 13న బీరంగూడ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న టెస్టుల స్టోర్‌కు శాంపిల్స్ కలెక్షన్ చేసుకోవడానికి రాగా దుస్తులపై ఐపో క్లోరైడ్ సొల్యూషన్ పడింది. శుభ్రం చేసుకోవడానికి వెళ్తుండగా దేవుడి చిత్రపటం ముందు వెలిగించిన దీపం పడి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆమె కాలిపోయింది. కాగా, ప్రాథమిక చికిత్స అనంతరం ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నియామకం

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్‌గా జాయా శ్రీను నియమితులైనట్లు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ హన్మంత్ యాదగిరి, పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాయా శ్రీను మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నిమజ్జన కోనేరు వద్ద పటిష్ట భద్రత

చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి



గంగారం కోనేరు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఈఈ

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ గంగారం చెరువు కోనేరు వద్ద గణనాథుల విగ్రహాల నిమజ్జనం కోసం పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తామని ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి పేర్కొన్నారు. శుక్రవారం గంగారం చెరువు కోనేరు వద్ద చేపట్టిన ఏర్పాట్లను జీహెచ్ఎంసీ ఈఈ శ్రీకాంతి, డీఈలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గణనాథుల విగ్రహాల నిమజ్జన కోసం అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కోనేరు భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు. కోనేరు చుట్టు వీధి దీపాలు, క్రేన్లు, జేసీబీల ద్వారా ఇంజినీరింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. చందానగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



విద్యార్థులకు విగ్రహాలను అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్

శేరిలింగంపల్లి: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తారానగర్‌లోని సన్‌షైన్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు మట్టి వినాయక విగ్రహాలను ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ... మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్కూల్ చైర్మన్ రాధిక, సిబ్బంది ఇషా, చిన్మయ్, సరిత పాల్గొన్నారు.

చందానగర్‌లో...

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు శంకర్, షర్ఫుద్దీన్, నక్కా శ్రీనివాస్, ప్రకాష్, విజయ్, సంతోష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాస్టిల్ టౌన్ స్కూల్‌లో...

మియాపూర్: మియాపూర్‌లోని క్యాస్టిల్ టౌన్ స్కూల్‌లో విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను హోఫ్ పౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ మహేందర్, స్కూల్ డైరెక్టర్ భ్రమర ప్రసాద్, ప్రిన్సిపాల్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మరిన్ని భాషలు నేర్చుకోవాలి

'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్‌అహ్మద్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఇతర ప్రొఫెసర్లు

రాయదుర్గం: ప్రతి విద్యార్థి మరిన్ని భాషలు నేర్చుకోవాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ దివస్ సందర్భంగా విద్య, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాతృభాష కాకుండా మరిన్ని ఇతర భాషలను నేర్చుకోవడానికి విద్యార్థులంతా ఆసక్తి కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. హిందీని అధికార భాషగా అమలు చేయడంలో విశ్వవిద్యాలయం కృసి, విజయాలను ప్రస్తావిస్తూ ఇటీవల పార్లమెంటరీ కమిటీ పర్యటనను ఆయన గుర్తు చేసుకున్నారు. హిందీ భాషలో కూడా 'మనూ' పరిపాలనా పనిని చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం–2020లో మాతృభాషకు కల్పించిన ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ అశ్విని రచించిన 'సమావేశి శిక్షా కే వివిద్ ఆయామ్' అనే పుస్తకాన్ని ఆవిస్కరించారు. అనంతరం 'డిజిటల్ యుగంలో హిందీ భవిష్యత్తు' అనే అంశంపై ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, ప్రొఫెసర్ కరణ్ సింగ్ ఉత్వాల్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్ధిఖీ మహ్మద్ మహమూద్, విద్యా, శిక్షణ విభాగం అధిపతి ప్రొఫెసర్ షహీన్ అల్తాఫ్‌షేక్,డాక్టర్ షగుఫ్తా పర్వీన్, డాక్టర్ అశ్విని, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జహంగీర్ ఆలమ్, డాక్టర్ వీఎస్ సుమీ, డాక్టర్ ఫర్హాస్‌తబస్సుమ్, డాక్టర్ రుబీనా, డాక్టర్ షేక్ ఎహ్తేషాముద్దీన్, హిందీ ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. పలు రకాల పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

'ఎస్కీ' మరిన్ని కోర్సులు ప్రారంభించాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

రాయదుర్గం: భౌతిక, మానవ వనరులను దృష్టిలో పెట్టుకొని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మరిన్ని నూతన కోర్సులను ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 56వ ఇంజనీర్ల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ముందున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, టెక్నో మేనేజ్‌మెంట్ డొమైన్‌లకు నాణ్యమైన శిక్షణ, విద్యను అందించడంలో 'ఎస్కీ' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ... దృఢమైన భవిష్యత్తును విద్యార్థులకు నిర్మించడంలో ఎస్కీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఏఅండ్‌పీ చీఫ్ ఎస్.లక్ష్మీకాంతరావు, పవర్, ఎనర్జీ సలహాదారు చంద్రమోహన్‌రావు, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.